ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 4 అక్టోబరు 2025





అశ్వరథంపై అమ్మవారి ఊరేగింపు దృశ్యం

అటవీ లెక్కలపై గందరగోళం

- తగ్గుతున్న విస్తీర్ణం
- గత హరితహారం వివరాలపై అయోమయం
- గతంలో ఇష్టారాజ్యంగా నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు
- చెట్ల నరికివేత, పోడు వ్యవసాయాలే కారణమంటున్న యంత్రాంగం



నిర్మల్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఇదే

నిర్మల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : క్రమంగా అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పడుతున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు చేపట్టిన మొక్కల పెంపకం కార్యక్రమం అబాసు పాలైనట్లు విమర్శలున్నాయి. అప్పటి ప్రభుత్వం చేపట్టిన హరితహారం పథకం ఆశించిన ఫలితమివ్వలేదన్న ఆరోపణలున్నాయి. పోడుసాగుతో పాటు అక్రమంగా చెట్ల నరికివేత, స్మగ్లింగ్ అలాగే వరదల కారణంగా అడవులు అంతరించిపోతున్నట్లు చెబుతున్నారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పట్టినట్లు స్పష్టమవుతోంది. నిర్మల్ జిల్లాలలో అటవీ విస్తీర్ణ శాతం తగ్గిపోయినట్లు ఐఎస్ఎఫ్ఆర్ నివేదిక ద్వారా వెల్లడవుతోంది. గత ఐదారేళ్ళ నుంచి ఇక్కడ అటవీ విస్తీర్ణం తగ్గుముఖం ఆ నివేదికలో పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

విస్తీర్ణం తగ్గుతున్నట్లు నివేదికలు....

కేంద్ర అటవీ, వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో ఫీల్డ్ బెస్ట్ సర్వే ఆధారంగా రిమోట్ సెన్సింగ్ సాటిలైట్ డాటాతో ఈ అడవుల సర్వే చేపట్టి వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించారు. ఈ లెక్కల ప్రకారం నిర్మల్ జిల్లాలో 45.37 చదరపు కిలో మీటర్లు, కొమురం భీం ఆసిఫాబడాద్ జిల్లాలో 44.61 చదరపు కిలో మీటర్లు, ఆదిలాబాద్ జిల్లాలో 115.50 కిలో మీటర్ల విస్తీర్ణం తగ్గిపోయినట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు. అయితే మంచిర్యాల జిల్లాలో మాత్రం సింగరేణి సంస్థ చేపట్టిన మొక్కల పెంపకం కారణంగా అడవుల విస్తీర్ణం పెరిగినట్లు ఆ రిపోర్టులో వెల్లడించారు. మూడు జిల్లాలకు భిన్నంగా మంచిర్యాల జిల్లాలో మాత్రం 34.96 చదరపు కిలోమీటర్ల అడవి పెరిగినట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇలా ఉండగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 1778.26 చదరపు కిలోమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 1564.93 చదరపు కిలోమీటర్లు, ఆదిలాబాద్ జిల్లాలో 1145.76 చదరపు కిలోమీటర్లు, నిర్మల్‌జిల్లాలో 1085.02 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం ఉన్నట్లు ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

చెట్ల నరికివేత ఓ కారణం...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెట్ల నరికివేత ఇంకా సద్దుమణగడం లేదు. కలప అవసరాల కోసం కొంతమంది స్మగ్లర్లు యథేచ్ఛగా చెట్లను నరికివేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో ఓ గ్రామంలో చెట్లను నరికివేసి కలపను భద్రపరిచిన ఇళ్ళపై అటవీ శాఖ అధికారులు తనిఖీలు చేయగా స్మగ్లర్లు వారిపై తిరగబడి దాడి చేసిన సంగతి తెలిసిందే. అటవీ అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ అలాగే నిఘా సారిస్తూ స్మగ్లింగ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ కొన్ని మారుమూల గ్రామాల్లో మాత్రం చెట్ల నరికివేత ఆగడం లేదు. పోడు వ్యవసాయం కోసం నిరంతరం చెట్ల నరికివేత కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. నిర్మల్ జిల్లాలోని కడెం, పెంబి, ఖానాపూర్, దస్తూరాబాద్ అడవుల్లో సైతం కొంతకాలం క్రితం వరకు పెద్ద ఎత్తున చెట్ల నరికివేత కొనసాగినట్లు ఫిర్యాదులున్నాయి. నిర్మల్ జిల్లాలో కూడా గతంలో పలుసార్లు అటవీ శాఖ అధికారులపై స్మగ్లర్లు దాడులు చేసిన సంగతి కూడా తెలిసిందే. అటవీ శాఖ చెట్ల నరికివేతను నిరోధించి స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదంటున్నారు. కొన్ని మారుమూలపల్లెల పరిధిలోని అడవుల్లోనే విస్తీర్ణం తగ్గుముఖం పడుతుందని చెబుతున్నారు.

ఫలితమివ్వని గత సర్కారు కార్యక్రమాలు..

ఉమ్మడి జిల్లాలో హరితహారం కార్యక్రమంలో భాగంగా దాదాపు 20 కోట్ల మొక్కలు నాటినట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. కాని ఆ మొక్కల లెక్కలపై అయోమయం నెలకొంది. ఇంత పెద్దమొత్తంలో మొక్కలు నాటితే అడవుల విస్తీర్ణం గణనీయంగా పెరిగాలి గాని, తగ్గిపోవడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కూడా చెట్లు నెలకొరిగిపోతున్నాయన్న వాదనలు కూడా ఉన్నాయి. బ్లాక్ సాయిల్‌తో కూడా చెట్లు వరదల పాలవుతున్నాయంటున్నారు.

అశ్వరథంపై అమ్మవారి ఊరేగింపు



అశ్వరథంపై అమ్మవారు

బాసర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో దసరా పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వరథంపై ఉత్సవ విగ్రహాన్ని కూర్చోబెట్టి గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అశ్వరథం గ్రామంలోకి రాగానే మహిళలు మంగళహారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. భక్తి గీతాలు, కోలాటాల మధ్య ఊరేగింపు వైభవంగా సాగి భక్తులకు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాత ప్యాట్ల సుఖేష్‌రావు కుటుంబం అశ్వరథం ఊరేగింపునకు కావాల్సిన ఏర్పాట్లలో స్వచ్ఛందంగా ముందుకు రావడంతో వారిని ఆలయ కార్యనిర్వాహణాధికారి అంజనాదేవి, ఏఈవో సుదర్శన్‌గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఆలయం వద్ద గల శమీపూజలో భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని సంప్రదాయ బద్ధంగా పండుగను జరుపుకున్నారు.

కలెక్టరేట్‌లో గాంధీ జయంతి



కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



గాంధీ పార్కులో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. యావత్తు దేశాన్ని మొత్తం స్వాతంత్ర్య సంగ్రామంలో సంఘటితం చేసి ముందుండి శాంతి, అహింసా మార్గాలలో నడిపించారన్నారు. గాంధీజీ జీవితాన్ని అందరం స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని గాంధీ పార్కులోని మహాత్మాగాంధీ విగ్రహానికి స్థానికసంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పూలమాల వేసి నివాళులర్పించారు. జయంతి వేడుకల్లో ఆర్డీవో రత్న కళ్యాణి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సూర్యారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డ్యాంగాపూర్ గ్రామం కాంగ్రెస్‌పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ ముక్కెర ముత్తన్నతో పాటు పలువురు నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, జమాల్, సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, చిన్నయ్య, నాయకులు రమేష్, జట్టు దినేష్, సంజీవ్, విజయ్, అశోక్, నర్సయ్య, సత్యనారాయణ, ప్రసాద్, నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెడుపై మంచి విజయానికి ప్రతీక దసరా

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఖానాపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండుగ అని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన రామ్‌లీలా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. రామ్‌లీలా ఉత్సవాలను వీక్షించేందుకు ఖానాపూర్ మండల నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలిచ్చారు. పలు గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. శమీ వృక్షానికి పూజలు నిర్వహించి ఒకరికి ఒకరు బంగారం (శమీ వృక్షం ఆకులు) ఇచ్చి పుచ్చుకొని విజయ దశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పట్టణంలో నిర్వహించిన జంబి పూజలకు హాజరయ్యారు.

ఉత్సాహంగా వేడుకలు



జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయదశమి ఉత్సవాల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శమిపూజ, ఆయుధ పూజ నిర్వహించి జ్యోతిప్రజ్వలన చేసి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. అత్యంత భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ దసరా అని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎస్పీలు రావణాసుర దహనం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వక్త అప్పాల ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ ముఖ్యులు పార్థసారధి, మూర్తి ప్రభాకర్, ముప్పిడి రవి, పతికే రాజేందర్‌తో పాటు పట్టణ నాయకులు తాజా మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రియదర్శినినగర్ అభయాంజనేయ ఆలయం వద్ద దసరా వేడుకలను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దుర్గాదేవి నవరాత్రి ముగింపు వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు చేసి షమ్మీ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులను ఉద్దేశించి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ... ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజురోజుకు ఆధునికత పోకడలు పెరుగుతున్నాయని అయితే ఆధ్యాత్మికత భావనతోనే అందరికీ ప్రశాంతత లభిస్తుందన్నారు. పట్టణ ప్రజలందరికీ ఈ సందర్భంగా ఇంద్రకరణ్ రెడ్డి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, మాజీ కౌన్సిలర్లు మేడారం ప్రదీప్, పతికే శ్రీనివాస్, మహాలక్ష్మి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కే. గంగాధర్, మాజీ దేవరకోట దేవస్థానం చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో వేడుకలు



పూజలు చేస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయి పుణ్యతిథిని పురస్కరించుకొని ఆలయ పూజారులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్న హారతి తర్వాత పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే సాయంత్రం విజయ దశమిని పురస్కరించుకొని శమీ పూజ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఆయా కార్యక్రమాల్లో సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి, సభ్యులు పూదరి నరహరి, నారాయణ రెడ్డి, జైపాల్ రెడ్డి, ఉప్పుల నందు, చౌదరి, కోల శంకర్, దశ గౌడ్, బాబన్న, రేఖ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ లో ఆయుధ పూజ

నిర్మల్ రూరల్ : మండలంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో దసరా పండుగ సందర్భంగా గురువారం పోలీసులు వాడే వాహనాలు, తుపాకులకు ఆయుధ పూజ నిర్వహించినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సామరస్యమైన జీవితాన్ని ప్రజలు గడపాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నర్సయ్య, ఏఎస్సై బాబా రావ్, దేవేందర్, శివయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దసరా పండుగ

సారంగాపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు బీరవెల్లి, స్వర్ణ, జాం, కౌట్ల గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో గురువారం ఘనంగా దసరా ఉత్సవాలను నిర్వహించారు. సారంగాపూర్ మండల కేంద్రంతో పాటు బీరవెల్లి, జాం, స్వర్ణ, కౌట్ల, చించోలి(బి) గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో నవరాత్రులలో వాడవాడల్లో కొలువై పూజలు అందుకున్న దుర్గాదేవి విగ్రహ నిమజ్జన కార్యక్రమాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని మహా ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో శుక్రవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే లు రాథోడ్ బాపురావు, రేఖ శ్యామ్ నాయక్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారీ శ్రీనివాస్ అమ్మవారికి హారతినిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్ష్మణచాంద : మండలంలోని ఆయా గ్రామాల్లో విజయ దశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత నిమజ్జన ఊరేగింపు ఘనంగా జరిగింది. బతుకమ్మ ఊరేగింపులో మహిళల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. లక్ష్మణచాందలో వేణుగోపాల స్వామి రథయాత్ర నిర్వహించారు. మునిపెల్లి గ్రామంలో యువకులు కేరింతలు చేస్తూ నృత్యాలు చేశారు. పీచరలో యువకులు కోలాటం ఆడారు. వడ్యాల్‌లో రావణ దహనంను పెద్ద సంఖ్యలో తిలకించారు. కార్యక్రమంలో స్థానికంగా గల మాజీ ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కుభీర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం గ్రామస్తులు విజయదశమి దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కుభీర్‌లోని తుల్జాపూర్ భవాని ఎల్లమ్మ మందిరానికి గ్రామస్తులు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

నిర్మల్‌రూరల్ : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి గురువారం మాజీ ఎమ్మెల్యేలు రేఖ శ్యామ్‌నాయక్, బాపురావు విజయ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి, వివిధ మండలాల నాయకులు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

లోకేశ్వరం : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి గ్రామంలో ఉదయం నుండే దుర్గామాత నిమజ్జనంలో భాగంగా శోభాయాత్ర నిర్వహించారు.

కుంటాల : మండలంలో గురువారం విజయ దశమి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా విజయదశమి పర్వదినం పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఉదయం నుంచి బతుకమ్మలు ఆడి అనంతరం సాయంత్రం వేళలో నూతన వస్త్రాలు ధరించి గ్రామ సమీపంలో గల జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు.

భైంసా : ఊరూ వాడా శమీపూజలు జరిగాయి. ఒకరినొకరు శమీని ఇచ్చి పుచ్చుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రావణుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతా మంచి జరుగాలని ఆకాంక్షించారు. సాయంత్రం వేళలో స్థానిక నర్సింహ స్వామి మందిరంలో, పద్మావతి కాలనీ పరిధిలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సామి ఆలయంలో షమ్మి చెట్టుకు పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు పూజలు చేపట్టారు. అనంతరం నర్సింహస్వామిని, లక్ష్మీ వెంకటేశ్వర స్వామిలను దర్శించుకొని పూజలు నిర్వహించారు.



మునిపెల్లిలో దసరా ఉత్సవం



నందిగుండం దుర్గామాత ఆలయ ప్రాంగణంలో...



సట్ల జలదేవునికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ముథోల్ ఎమ్మెల్యే



పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ముథోల్ ఎమ్మెల్యే

ముథోల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు వివిధ గ్రామాల్లో విజయదశమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. విజయదశమి వేడుకలను పురస్కరించుకుని కొత్త వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చించాల గ్రామంలో గల పెద్దమ్మ తల్లిదేవిని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ముథోల్ ఎస్సై బిట్ల పెర్సెస్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. గ్రామ పొలిమేరలోని జమ్మి చెట్టుకు బాజాభజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా విజయ దశమి పండుగ సందడి కనిపించింది.

కారేగాంలో ఎల్లమ్మ జాతర...

ముథోల్ : మండలంలోని కారేగాం గ్రామంలో దసరా నవరాత్రుల్లో భాగంగా రేణుక ఎల్లమ్మ దేవి జాతర గురువారం ఘనంగా జరిగింది. తొమ్మిది రోజుల నుంచి ఆలయంలో వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా రోజు జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు.


ఆదిలాబాద్‌లో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్


.. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్


నేరడిగొండలో నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళి

● పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భారత జాతిపిత మహాత్మా గాంధీ చూపిన శాంతి సామరస్యం ద్వారా ప్రతీ సమస్యను పరిష్కరించుకోవచ్చని, ఆయన సూచించిన ఏడు సూత్రాలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మహాత్మాగాంధీ ఎ జయంతి సందర్భంగా గురువారం స్థానిక గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళి సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.... గాంధీజీ అహింస మార్గంతో స్వాతంత్రం సి?చిందని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని సత్యం, అహింస మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. పట్టణం, గ్రామాల్లో స్వచ్చత పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. అదేవిధంగా స్థానిక గాంధీ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా మాజీమంత్రి జోగురామన్న సైతం గాంధీ విగ్రహానికి నివాళ్లు అర్పించి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, సామాజిక కార్యకర్త బండారి దేవన్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● యువత గాంధీ అడుగు జాడల్లో నడవాలి

నేరడిగొండ: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని నేరడిగొండ మండల కేంద్రంలో అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీజీ సేవలు మరువలేవని, యువత గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగ్, సురేందర్, పండరీ, అఖిల్‌రెడ్డి, సుభాష్, కైలాష్, లింబాజీ, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ లక్కు... ఎవరికో?!

(5వ పేజీ తరువాయి...)

కదుపుతున్నాయి. ఒక్కో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానానికి ముగ్గురు నలుగురు అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నారు. అభ్యర్థుల ఎంపికే ప్రధానమన్న భావనతో పార్టీలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల్లో కీలకంగా ఉన్న నేతలతో పాటు పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు సైతం ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. కానీ చాలా మంది నేతలకు రిజర్వేషన్ కలిసి రాకపోవడంతో తాజా మాజీలు స్థానిక ఎన్నికలకు దూరమవుతున్నారు. అన్ని పార్టీలకు అభ్యర్థుల ఎంపిక కొంత ఇబ్బందికరంగానే మారింది. ఈ సారి కొత్త వారికి టికెట్లు కేటాయించాల్సిరావడంతో ఎవరైతే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నారు. టికెట్టును ఆశిస్తున్న వారంతా ప్రధాన పార్టీల కు చెందిన ముఖ్య నేతల వద్దకు పరుగులు తీస్తున్నారు. అందరి అభిప్రాయాలను తీసుకుంటున్న ముఖ్యనేతలు వేచి చూసే ధోరణితో కనిపిస్తున్నా రు. పార్టీ దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ఎవరికి కచ్చితమైన హామీ ఇవ్వడం లేదని తెలుస్తుంది. కానీ చాలా మంది అభ్యర్థులు తమకే టికెట్ వస్తుందని జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. ముఖ్యంగా అభ్యర్థుల గుణగణాలు కుటుంబ నేపథ్యం, సామాజిక వర్గం మద్దతు గెలుపు అవకాశాలు, తదితర వాటిని పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది.

రైలు కిందపడి ఒకరి మృతి


వెంకట్(ఫైల్)

తలమడుగు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని ఉండం గ్రామానికి చెందిన వెంకటి(37) అనే వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వేశాఖ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. పూర్తి వివరాల ప్రకారం.. మండలంలోని ఉండం గ్రామానికి చెందిన వెంకటి గత కొంత కాలం క్రితం కారు ప్రమాదంలో కాలు విరిగి కూలి పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. ఇంటి వద్దనే ఉంటున్నాడని, ఈ నెల తేదీ 1న తమ గ్రామానికి చెందిన సాకిపెల్లి పోశెట్టికి మోటర్ సైకిల్‌తో ఢీకొట్టాడు. దీంతో పోశెట్టికి కాలు విరిగి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై మృతుడిపై తలమడుగు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. అప్పటికే ఏమీ పని చేయకుండా మద్యానికి బానిస కావడం, పైగా కేసు నమోదు అవ్వడంతో.. ఆ కేసును ఎదుర్కొలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పూనుకున్నాడు. దీంతో 3-10-2025 ఉదయం 5.56 గంటలకు ఉండం గ్రామ శివారులో ఆదిలాబాద్ వైపు వస్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి పట్టాలపై తలపెట్టగా ట్రైన్ ఢీకొని చనిపోయినాడని కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైతు ప్రాణం తీసిన సోలార్ కంచె!

నేరడిగొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తన పంటను కోతుల బారీ నుంచి రక్షించుకునేందుకు వేసిన సోలార్ కంచెను ఓ రైతు ప్రాణం తీసిన ఘటన నేరడిగొండ మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం.. తేజాపూర్ గ్రామానికి చెందిన రైతు నారాయణ రెడ్డి తన పంట చేను రక్షణ కోసం సోలార్ కంచెను బిగించాడు. గురువారం పంటలోకి కోతలు వచ్చాయని వాటి తరిమేందుకు వెళ్లిన నాయణరెడ్డికాలుకు ప్రమాదవశాత్తు సోలార్ కంచె తగిలి కింద పడి మృతి చెందడాన్నారు. ఈ మేరుకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దివస్


● ముథోల్‌లో పెద్దసంఖ్యలో పాల్గొన్న బౌద్ధులు, దళితులు

భైంసా, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం దమ్మ చక్ర పరివర్తన్ దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలకు దళిత సంఘాల ప్రతినిధులు, శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. స్థానిక బస్టాండ్ ఎదుట జరిగిన కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పాల్గొని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ కాలనీల నుంచి గౌతం బుద్దుని, భారత రత్న బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలను వాహనాలపై అందంగా అలంకరించి శోభాయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం వేళలో ప్రారంభమైన శోభాయాత్ర రాత్రి వరకు పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. ఈ శోభాయాత్రలో యువకులు సౌండ్ సిస్టంకు అనుగుణంగా నృత్యాలు చేశారు. మహిళలు గేయాలు అలపించారు. చిన్నారులు కొలాటాలు వేస్తూ, డాన్స్‌లు చేస్తూ శోభాయాత్రకే వన్నె తెచ్చారు. వివిధ కాలనీల నుంచి శోభాయాత్ర ద్వారా తరలివచ్చిన దళిత సంఘాల శ్రేణులు బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. దళితుల అభ్యున్నతి అయన చేసిన సేవలను కొనియాడారు. స్థానిక బుద్దవిహార్‌కు శోభాయాత్ర ముగిసింది. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో పట్టణ సీఐ గోపినాథ్ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లో గురువారం రోజున 69వ దమ్మ చక్ర పరివర్తన దినోత్సవ వేడుకలను బౌద్ధులు, దళితులు ఘనంగా జరుపుకున్నారు. 1956 అక్టోబరు 14న మహారాష్ట్రలోని నాగపూర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత తన అనుయాయులతో బౌద్ధ మతాన్ని స్వీకరించడానికి పురస్కరించుకొని ప్రతి సంవత్సరం దమ్మచక్ర పరివర్తన దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగార్జున నగర్, బుద్ధ నగర్, అంబేడ్కర్ నగర్, యశ్వంత్ నగర్, అశోక్ నగర్, నాగ్ సేన్ నగర్‌లోని బుద్ధ విహార్‌లలో పంచశీల జెండాను ఆవిష్కరించి గౌతమ బుద్ధుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్ర పటానికి దీపధూప, పంచశీల త్రిశరణ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ప్రతిష్ఠించి బాజా భజంత్రీల మధ్య ఊరేగింపు నిర్వహించారు. గాంధీ చౌక్, మజీద్ చౌక్, బ్రహ్మణ గల్లీ, పాత బస్టాండ్ మీదుగా ఐబీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఊరేగింపు కొనసాగింది. ఊరేగింపు ఉత్సవాలను పురస్కరించుకొని యువకులు, చిన్నారులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దమ్మ చక్ర పరివర్తన దినోత్సవ ఊరేగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముథోల్ పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో దమ్మచక్ర పరివర్తన దినోత్సవం పురస్కరించుకొని దళిత సంఘాల ఆధ్వర్యంలో బుద్ధుడు, రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూలమాలలు వేసి పంచశీల జెండాను ఆవిష్కరించారు. ఊరేగింపు ఉత్సవాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావడంతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దళిత సంఘం నాయకులు, ఉపాసకులు, తదితరులు పాల్గొన్నారు.


కల్లూరులో సాయి నామస్మరణ చేస్తున్న భక్తులు

ముగిసిన సాయిబాబా పుణ్యతిథి

కుంటాల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు దత్త వెంకట సాయి మందిరంలో గురువారం సాయిబాబా పుణ్యతిథిని ఘనంగా నిర్వహించారు. 1918 సంవత్సరంలో విజయదశమి రోజున సాయిబాబా మహా సమాధి కాగా.. నేటికి 107 సంవత్సరములు గడువగా విజయదశమి పండుగ రోజు ఈ సాయిబాబా పుణ్యతిథిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి సాయి నామస్మరణను బుధవారం మొదలుకొని గురువారం వరకు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం, తాగునీరు ఏర్పాటు చేశారు.

మహరాజ్‌ను దర్శించుకున్న మాజీ ఎంపీ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కందర్ తాలూకాలోని ఉంరాజ్ దాక్రె పండర్‌పూర్‌లోని ఏక్‌నాథ్ మహారాజ్‌ను మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరకున్న మాజీ ఎంపీకి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి మహారాజ్ జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట గుడిహత్నూర్ మండల పెద్దలు, తదితరులు ఉన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు

నార్నూర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన నార్నూర్ మండలానికి చాలా సంవత్సరాల తర్వాత ఎస్సీ మహిళగా జడ్పీటీసీ స్థానానికి రిజర్వేషన్ రావడంతో తమకు ఈసారి అవకాశం కల్పించాలంటూ పార్లమెంట్ సభ్యుడు జి.నగేష్ పలువురు బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని కార్యకర్తలతో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షులు బిక్కు రాథోడ్, ప్రవీణ్ రాథోడ్, బీజేపీ కౌన్సిల్ సభ్యుడు జాదవ్ రెడ్డి నాయక్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానోబా పుష్కర్, మహిళా నాయకురాలు విద్యారాణి, బాబులాల్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ వైద్యుడి మృతి


కుమార్ యాదవ్ మృతదేహం

భైంసా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో దసరా వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన శ్రీనివాస హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ కుమార్‌యాదవ్ (42) రోడ్డు ప్రమాదం బారిన పడి మృత్యువాత పడ్డాడు. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన ప్రకారం డా.కుమార్ యాదవ్ గురువారం సాయంత్రం దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మిత్రులతో కలిసి వేడుకలు జరుపుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణంలో ఏపీ నగర్ క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదం బారిన పడ్డాడు. ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. . ప్రమాదంలో బైక్ పై నుంచి కింద పడ్డ డా.కుమార్ యాదవ్ తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు క్షతగాత్రుడిని ఇక్కడి ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్సలు నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం గాను నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అర్ధరాత్రి వేళలో తలకు శస్త్రచికిత్స నిర్వహించారు. అయినప్పటికీ ఆరోగ్యం ఎంత మాత్రం కుదుట పడలేదు. క్రమ క్రమంగా క్షీణించి శుక్రవారం మధ్యాహ్నం వేళలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ గోపినాథ్ కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని నిజామాబాద్ నుంచి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పంచనామ,పోస్టుమార్టం నిర్వహించారు.

చెట్టుకు ఢీకొని ఒకరి మృతి

సోన్ : బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం... పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి వాడకు చెందిన కొప్పుల సాయన్న(37) అనే వ్యక్తి సోన్ మండలంలోని గంజాల్ టోల్ ప్లాజాలో ఉద్యోగానికి బైక్‌పై వెళ్తుండగా, అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

మృతదేహం లభ్యం

దస్తురాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవోజిపేట్ గ్రామానికి చెందిన మైదం సురేందర్(45) అనేవ్యక్తి రెండు రోజుల క్రితం కడెం ఎడమ ప్రధాన కాలువలో పడి గల్లంతైన ఘటన తెలిసిందే. గురువారం ఉదయం కాలువ ప్రవాహం తగ్గడంతో బుటాపూర్ గ్రామ శివారులో డీ7 తూము వద్ద అతని మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే... సురేందర్ బుధవారం ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయాడు. అతని కోసం గ్రామస్థులు, స్థానిక పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టగా, రెండోరోజు ఉదయం మృతదేహం బయటకు వచ్చి లభ్యమైంది. సురేందర్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పండుగ వేళ ఈ ఘటనతో గ్రామంలో తీవ్రవిషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరి మృతి

తానూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌కు చెందిన దోమాజీ సాయినాథ్(40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం.. సాయినాథ్ గ్రామ సమీపంలోని ఓ కాలువ వద్దకు చేపల వేట కోసం వెళ్లాడు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు కాలువలో మృతదేహం గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించి సాయినాథ్‌గా గుర్తించారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెంది ఉండవచ్చునని భావిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. ఈ మేరకు కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కుంటాల, అక్టోబరు, 3 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన గుజ్జోల్ల లక్ష్మీ బాయి (80) అనే వృద్ధురాలు గురువారం గ్రామ సమీపంలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు లక్ష్మీబాయి మహారాష్ట్ర మలక్‌జామ్ వాసి. మూడునెలల క్రితం ఆమె కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమెకు కొద్ది రోజుల నుంచి అనారోగ్యం కారణంగా దౌనెల్లి గ్రామంలో ఆమె కూతురు వద్ద ఉంటోంది. మూడునెలల క్రితం అనారోగ్యం కారణంగా ఆమెకు ఆపరేషన్ సైతం చేయించారు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం

కుంటాల, అక్టోబర్, 3 : (ఆంధ్రజ్యోతి) : మం డల కేంద్రం కుంటాలతో పాటు ఓలా, అం బకంటి, కల్లూరు గ్రామాలలో శుక్రవారం దుర్గామాత నిమజ్జనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గత 12 రోజులుగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గా మండపాల వద్ద ప్రతి రోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, రాత్రి వేళల్లో భజన కోలాటలు, కుంకుమార్చన, యజ్ఞం అన్నదానం తదితర కార్యక్రమాలు చేపట్టిన భక్తులు శుక్రవారం ఉదయం ప్రత్యేక వాహనంలో దుర్గమ్మను ఉంచి గ్రామం ప్రధానవీధులగుండా బతుకమ్మలు, కోలాటల మధ్య సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

కుభీర్ : మండల కేంద్రం కుబీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం దుర్గమ్మ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా యువజన సంఘాల ఆధ్వర్యంలో నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన వాహనాల్లో ఉంచి గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్రలో భజనలు, భజనపాటలతో యువకులు నృత్యాల నడుమ సాగింది. అనంతరం సమీప వాగులు, చెరువుల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.


ఓలాలో దుర్గామాతను ఊరేగింపుగా తీసుకెళుతున్న గ్రామస్తులు

మహాత్ముడి బాటలో నడవాలి


మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు


కుభీర్‌లో గాంధీ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీహరి రావు పట్టణంలోని గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాత్మా గాంధీ సత్యాగ్రహం, అహింసా, సామాజిక న్యాయం కోసం చేసిన త్యాగం భారత దేశానికి మాత్రమే కాకుండా ప్రపంచానికే ఆదర్శమని గుర్తు చేశారు. ఆయన చూపిన మార్గం ద్వారా దేశం స్వాతంత్ర్యం సాధించిందని, సమాజంలోని ప్రతి వ్యక్తి గాంధీ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. నేటి తరానికి గాంధీ బోధనలు ఎంతో అవసరమని, అహింసా సిద్ధాంతం, సత్యనిష్ఠ, సమానత్వం, దుర్బలుల పట్ల కరుణ ఇవన్నీ సమాజ అభివృద్ధికి పునాది అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిస్తేనే దేశం నిజమైన ప్రగతిని సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, గంద్రత్ ఈశ్వర్, బురాజ్, శ్రీనివాస్, పోశెట్టి, నర్సారెడ్డి ఉన్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుబీర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాగర్‌రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


వద్యాల్‌లో రావణ దహనం చేస్తున్న దృశ్యం


తులాభారం చేసుకుంటున్న మాజీ మంత్రి అల్లోల

దసరా వేడుకలు


రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ


జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం


భైంసాలో దహనమవుతున్న రావణాసురుని దిష్టిబొమ్మ


ఎల్లమ్మ ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


జైనథ్‌లో దుర్గాదేవి శోభయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


భైంసా శోభయాత్రలో పోతరాజుల విన్యాసాలు


భైంసా శోభయాత్రలో కోలాటాలు వేస్తున్న పద్మావతి కాలనీ మహిళలు

వైభవంగా దుర్గామాత విగ్రహాల
నిమజ్జన శోభాయాత్ర

» కదిలివచ్చిన ఆశేష భక్త జనం » వాడవాడల మార్మోగిన జై భవాని నామస్మరణ » ఆట, పాటలతో శోభయాత్రకు వన్నె తెచ్చిన మహిళలు

భైంసా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జై బోలో భవాని మాతకి జై ... అంబే జగదంబే పాహిమం నినాదాలు, పోతరాజుల విన్యాసాలు, మహిళలు కోలాటాలు, దాండియా ఆటలు, డప్పుల దరువులు.. డీజేల హోరు.. బాణాసంచా వెలుగులు.. చిన్నా పెద్దా చిందులతో శుక్రవారం భైంసా పట్టణం ఆధ్యాత్మిక సాగరంగా మారింది. ఎప్పటిలాగే ఈ యేడు కూడా దుర్గామాతల నిమజ్జనోత్సవం వైభవోపేతంగా జరిగింది. మండపాల్లో కొలువు దీరి నవ రాత్రులు పూజలు అందుకున్న దుర్గామాతలు శుక్రవారం నిమజ్జనానికి బయలుదేరగా భైంసా పట్టణమంతా భక్తి పారవశ్యంతో ఆనంద తాండవమాడింది. ఏ వీధి చూసిన సందడే. అన్ని దారుల్లోనూ కోలాహలమే. శోభాయాత్రలో అందరూ పసుపు రంగు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ, కోలాటాలు వేస్తూ దుర్గమ్మలను భక్తిశ్రద్ధల మధ్య గంగమ్మ ఒడికి చేర్చారు. భక్తుల కోలహాలం మధ్య పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలకు శుక్రవారం ఉదయం వేళలో మండపాల్లో మండలీల సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రకు తరలించారు. పట్టణంలోని భవాని చౌక్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్‌లతో పాటు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు, దుర్గామాత మండలీల సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవ శోభయాత్రను ప్రారంభించారు. అనంతరం గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పలు కాలనీల నుంచి శోభయాత్రగా వచ్చిన దుర్గామాత విగ్రహాలకు హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం నిర్వహించారు. దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవ శోభయాత్ర భక్తుల కోలహాలం మధ్య ఆద్యాంతం ఉత్సాహ భరితంగా కొనసాగింది. దుర్గామాత విగ్రహల ముందు ఆయా మండలిల సభ్యులు నృత్యాలు చేస్తూ , మహిళలు కోలాటాలు వేస్తూ శోభయాత్రకు వన్నె తెచ్చారు. ప్రధానంగా పలు మండలిల మహిళలు తలపాగాలు ధరించి కోలాటాలు వేస్తూ శోభయాత్రకు వన్నె తెచ్చారు. ఇక కొన్ని మండలీల సభ్యులు సంప్రదాయ బద్దంగా నిమజ్జనోత్సవ ప్రక్రియను చేపట్టారు. భజనలు చేస్తూ డోలు వాయించుకుంటూ, భక్తి గేయాలు ఆలపిస్తూ శోభయాత్ర చేపట్టారు. కొన్ని సంఘాలు ఎడ్ల బండ్లు, తోపుడు బండ్లపై దుర్గామాత విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

ప్రత్యేక ఆకర్షణగా మహిళల కోలాటలు

పట్టణ పరిధిలో జరిగిన దుర్గామాత నిమజ్జనోత్సవ శోభయాత్రలో మహిళల కోలాటలు, దాండియా ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శోభయాత్రలో అధిక శాతం దుర్గామాత విగ్రహాల ముందు మహిళలు కోలాటలు వేశారు. పురుషులతో సమానంగా మహిళలు ఈ సంవత్సరం దుర్గామాత నిమజ్జనోత్సవ శోభయాత్రలో పాల్గొన్నారు. పలు దుర్గామాత విగ్రహాల ముందు మహిళలు నృత్యాలు సైతం చేశారు. భవాని చౌక్ సార్వజనిక్ దుర్గామండలి వారు నిమజ్జనోత్సవ శోభయాత్రలో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక్కడి మండలి వద్ద పోతరాజులు విన్యాసాలు తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

జైనథ్‌లో..

జైనథ్: ఉమ్మడి మండలంలోని బోరజ్, సాత్నాల, జైనథ్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి శారదమాతలకు శరన్నవ రాత్రి వేడుకల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం చివరి రోజు అయిన శుక్రవారం మండల కేంద్రమైన జైనథ్ నవ శక్తి దుర్గామండల్ ఆధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిత్యహోమం నిర్వహించారు.

ముథోల్‌లో..

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆష్టా, బోరిగాం, రాంటెక్, చించాల, వెంకటాపూర్, తరోడా, తదితర గ్రామాల్లో శుక్రవారం దుర్గామాత నిమజ్జనోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వాహకులు దుర్గామాతను మండపంలో ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు. నిమజ్జనం రోజు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్రను నిర్వహించారు. మండలంలోని చించాల, తరోడా గ్రామాల్లోని దుర్గామాతలకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు.

శోభాయాత్రలో యువకుడికి గాయాలు

ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో సౌండ్ సిస్టంపై నుంచి ఓ రాయి యువకుడికి తగిలింది.దీంతో ఇరు గ్రూపుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ తన సిబ్బందితో హుటాహుటీన గ్రామానికి చేరుకొని ఇరుగ్రూపుల వారికి సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.


భైంసాలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత


భైంసా దుర్గామాత నిమజ్జనోత్సవ శోభయాత్రలో పాల్గొన్న భక్తజనం



తరోడాలో కోలాటం ఆడుతున్న మహిళలు


ముథోల్‌లో పోలీసుల బందోబస్తు


భైంసాలో ప్రసాద వితరణ చేపడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్

జోరుగా ప్రసాదాల వితరణ

భైంసా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం జరిగిన దుర్గాదేవి విగ్రహల నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని పలు సంఘాలు జోరుగా ప్రసాదాల వితరణ చేపట్టాయి. ప్రధాన రోడ్డు మార్గంతో పాటు శివాజీ చౌక్, గాంధీ గంజ్, కపాడ మార్కెట్, పోస్టాఫీస్ రోడ్డు,మున్సిపల్ కార్యాలయాల వద్ద పలు సంఘాలు, వ్యాపార సంస్థల నిర్వాహకులు ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించాయి .ప్రధాన రోడ్డు మార్గంలో తిరుమల హర్డ్ వేర్ వ్యాపార సంస్థ ప్రతినిధులు సి.వెంకటేష్, సి.ఆకాష్‌లు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం, యాదవ సంఘం ప్రతినిధులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రసాదాల వితరణ చేపట్టారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తిరుమల హార్డ్‌వేర్ వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టి ప్రసాదాల వితరణను ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కార్గాం వినోద్ కుమార్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, బీజేపీ ప్రతినిధులు వెంగళ్‌రావ్, తూమోల్ల దత్తు, ప్రముఖ హోమియో వైద్యులు డా.మధుసూదన్ గౌడ్, వ్యాపార వేత్త ధర్మరావ్, కాటన్ వ్యాపారి శంకర్, సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ ప్రతినిధి నగేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


బందోబస్తులో వజ్ర వాహనం

నిఘా నీడలో కొనసాగిన శోభాయాత్ర

» భారీ పోలీసు బందోబస్తు
» అధ్యంతం అప్రమతంగా వ్యవహరించిన పోలీసు అధికారులు
» బందోబస్తులో 300 మంది పోలీసు అధికారులు, సిబ్బంది

భైంసా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక ప్రాంతంగా పేరొందిన భైంసా పట్టణ పరిధిలో శుక్రవారం జరిగిన దుర్గామాత నిమజ్జనానికి పోలీసు శాఖ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది .గతంలో దుర్గామాత నిమజ్జనోత్సవ ప్రక్రియలో చోటు చేసుకున్న వివిధ ఘటనలను దృష్టిలో పెట్టుకొని పోలీసు శాఖ ఆద్యాంతం అప్రమత్తంగా వ్యవహరించింది. ఈ క్రమంలో నిమజ్జనోత్సవ శోభయాత్ర పోలీసుల నిఘా నీడలో కొనసాగింది. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో సీఐ గోపినాథ్, ఎస్సైలు నవనీత్ రెడ్డిలు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. బందోబస్తు విధుల్లో ఇద్దరు అదనపు ఎస్పీలు,ఒక అడ్మిన్ ఏఎస్పీ, 9 మంది సీఐలు, 18 మంది ఎస్ఐలు, ఏడుగురు ఏఎస్ఐలు, 19 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 15 మంది శివంగి బృందంతో కలిపి మొత్తం కలిపి 300 మంది సివిల్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లు, బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ టీం పాల్గొన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా పట్టణంలోని 26 వార్డులను 4 సెక్టారులుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు. 20 పోలీసు పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు 4 పెట్రోలింగ్ టీంలు నిరంతరం పర్యవేక్షణ జరిపాయి. ద్విచక్ర వాహనాల పెట్రోలింగ్ టీంలు, ఫుట్ పెట్రోలింగ్ టీంలు రౌండ్ ది క్లాక్ పర్యటనలు జరుపుతూ బందోబస్తు విధులు చేపట్టాయి. ఒక్కో సెక్టార్ పరిధిలో ప్రత్యేక అధికారిగా ఎస్ఐ, ఏఎస్ఐ, నల్గురు పోలీసు కానిస్టేబుళ్ల బృందం రౌండ్‌ది క్లాక్ పర్యవేక్షించారు. సమస్యాత్మక, వివాదస్పద ప్రాంతాల్లో క్విక్ యాక్షన్ టీం భద్రత చర్యలు చేపట్టాయి.


పంజేషా చౌక్‌లో బందోబస్తు విధుల్లో పోలీసు అధికారులు, సిబ్బంది

వైభవంగా దసరా ఉత్సవాలు

(5వ పేజీ తరువాయి...)

ప్రజలు ఘనంగా నిర్వహించుఉన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని రామమందిరం ప్రాంగణంలో జరిగిన దసరా ఉత్సవాల్లో భాగంగా షమీ పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీరామ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి సాడిగే రాజేశ్వర్‌లు పూజారి సంతోష్‌దూబే ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రావణాసురిడి దిష్టి బొమ్మను బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్ బాణసంచాతో నిప్పు అంటించారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద వాహనాలకు పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే ద్విచక్ర వాహనాన్ని స్వయంగా నడుపుతూ పూజ కార్యక్రమానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హిందు ఉత్సవ సమితి సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. షమీ పత్రాలు అందుకున్న ప్రజలు తమకు అందుబాటులో ఉన్న ప్రతీ ఒక్కరికి పత్రాన్ని బగారంగా అందిస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రతీఒక్కరు కొత్త దుస్తులు ధరించి ఎంతో సంబురంగా వేడుకలు నిర్వహించుకున్నారు.

● నేరడిగొండలో వాహన పూజ చేసిన ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలకేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దసరా పండుగ సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని కోరారు.

ఘనంగా మహిషాసురా దహనం

నేరడిగొండ మండల కేంద్రంలో వహిషాసుర దహనకార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని స్థానికులతో కలిసి రవాణా దహనం చేశారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు తదితరలు పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలు

ఇచ్చోడలో అంబరాన్నంటిన సంబురాలు

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో విజయదశమి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో గల జంబి చెట్టు వద్దకు ఊరేగింపుగా వెళ్లి శమీ వృక్షానికి మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరినోకం పండుగ శభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇచ్చోడ సర్కిల్ కార్యాలయంలో పరిధిలో సీఐ రాజు, ఎస్సై పురుషోత్తం, సిబ్బంది పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ చేశారు. అలాగే, ఇచ్చోడ మండల కేంద్రంలో గురువారం గ్రామపెద్ద కాపు నిమ్మల దమ్మరెడ్డి ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుల మధ్య గ్రామస్థులతో కలిసి శమీ చేట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ ప్రజలకు దసరా విజయోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.


ఇచ్చోడ గ్రామ పెద్దకాపు ఇంటివద్ద దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న పట్టణ ప్రజలు

సతుల కోసం పతుల యత్నం

● ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆశావహులు

ఉట్నూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్లు రావడంతో పాటు రిజర్వేషన్లు అధికారులు ఖరారు చేయడంతో ఆశావాహుల పరిస్థితి అడకత్తెరలో పోక వక్కల మారింది. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి పోటీ చేయడానికి పది మంది వరకు అభ్యర్థులు గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తుండగా సర్పంచ్ స్థానానికి మహిళ రిజర్వేషన్ రావడంతో పు రుష అభ్యర్థుల పరిస్థితి అగమ్యఘోచరంగా మారింది. మేజర్ గ్రామ పంచాయతీ స్థానానికి పోటీ తీవ్రం కానున్నట్లు తెలుస్తుంది. గతంలో పదవులు అనుభవించిన నాయకులు సైతం సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఉట్నూర్ జడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు కావడంతో జడ్పీటీసీ స్థానంపై ఆశలు పెంచుకున్న గిరిజన అభ్యర్థులు సర్పంచ్ పదవినైనా దక్కించుకుందామని భావిస్తున్నట్లు తెలుస్తుంది. మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేయాలని పలువురు భావించడంతో పాటు కొంత మంది సామాజిక కార్యకర్తలు సైతం కొన్నేళ్లుగా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ స్థానం కూడా మహిళలకు రిజర్వు కావడంతో వారి ఆశలన్ని ఆవిరి అయిపోయాయి. దీంతో సతులను రంగంలో దింపాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే అదునుగా ఫ్లెక్సీ సెంటర్లకు వెళ్లి తమ భార్యమణులను ఆయా పంచాయతీల సర్పంచ్ అభ్యర్థులుగా పోటీల్లో దింపడానికి ఫ్లెక్సీలు ముద్రిస్తున్నారు. అంతేకాకుండా సామాజిక మాధ్యమాల్లో పెడుతూ ప్రచారం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదే మాదిరి బీర్సాయిపేట, చాందూరి, దంతనపల్లి గోండుగూడ జీ, హస్నాపూర్, కన్నాపూర్, లక్కారం, లక్షేటిపేట, నడ్డం గూడ, నాగపూర్, పులిమడుగు, సాకెరాజె, శ్యామ్‌నాయక్‌తండా, టక్కుగూడ, తాండ్ర, ఉమ్రి, లింగోజితండా ఎక్స్‌రోడ్, గ్రామ పంచాయతీలను ఎస్టీ మ హిళలకు రిజర్వ్ చేయడంతో తమ సతులను రంగంలోకి దించాలని పతులు యోచిస్తున్నారు. అంతటితో ఆగకుండానే వారి ద్వారా గ్రామాల్లో ప్రచారాలు సైతం ఊపందుకున్నాయి. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించడంతో సర్పంచ్ అభ్యర్థులు సైతం కొందరు ఎంపీటీసీ స్థానాల్లో తలపడాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

లోకేశ్వరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఛత్ర పతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు రామన్‌వార్ సంటెన్న, మెండే రమణ భూమి పూజ ని ర్వహిం చారు. గ్రామంలోని ధర్మోర చౌరస్తా సమీపంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు రామన్ వార్ సంటెన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి దాతగా ముందు కువచ్చారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ అడుగు జాడల్లో యువత ప్రయాణించాలన్నారు. విగ్రహ దాతకు గ్రామం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్, సుభాష్ రెడ్డి, లోకేశ్వరం మండల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్ పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి

● బజార్‌హత్నూర్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

బజార్‌హత్నూర్ అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది ప్రతీఒక్కరు క్రమశిక్షణతో పాటు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని, కేసులో దర్యాప్తు, నేర పరిశోధనపై పురోగతి సాధించి నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు న్యాయం చేసేలా వేదికలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలన్నారు. వాహనాలను పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలకు తావివ్వకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్‌క్రైమ్, డిజిటల్ ఫ్రాడ్, గంజాయి, మాధకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, బోథ్ సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



టికెట్ లక్కు.. ఎవరికో?!

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్.. ఖరారు కావడంతో ఆశావహ నేతలంతా టికెట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రధాన పార్టీలు అందరికీ ఒకే అంటున్న చివరికి టికెట్ లక్కు ఎవరికి దక్కుతుందోనన్న టాక్ జోరుగా వినిపిస్తుంది. రిజర్వేషన్లు తారుమారు కావడంతో సీనియర్లకు అవకాశం లేకుండా పోయింది. దీంతో కొత్త నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ప్రస్తుతం పోటీపడే అభ్యర్థులంతా కొత్తవారే కావడంతో ప్రధాన పార్టీలకు ఇదో కొత్త తలనొప్పిగా మారిందంటున్నారు. అంతేకాకుండా ఎవరైతే బాగుంటుందని ఆరా తీస్తున్నారు. రిజర్వేషన్ల ప్రకారం దీటైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ప్లాన్ చేస్తున్నారు.

- జిల్లాలో దీటైన అభ్యర్థుల కోసం ప్రధాన పార్టీల వేట
- ఒక్కో స్థానానికి ముగ్గురు, నలుగురి పేర్ల పరిశీలన
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ టికెట్ల కోసం పోటాపోటీ
- గ్రామాల్లో ఆసక్తికరంగా మారిన స్థానిక సంస్థల ఎన్నికల సమరం
- అక్టోబరు 9వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక వర్గాల వారీగా మంచి పలుకుబడి ఉన్న వారిని బరిలో దింపాలని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. కాగా మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాయి. టికెట్ల కేటాయింపులో ఏసామాజిక వర్గం నుంచి వ్యతిరేకత రాకుండా జాగ్రత్త పడుతున్నారు.



నియోజక వర్గం, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి అభ్యర్థుల ఎంపిక బాధ్యతను అప్పగించారు. అక్టోబరు 9వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణకు అవకాశం ఉండడంతో ఆలోగా అభ్యర్థుల ఎంపిక కొలిక్కివచ్చే అవకాశం కనిపిస్తుంది. అభ్యర్థుల ఎంపికలో ప్రధాన పార్టీలు ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నాయి. పార్టీ నాయకుల ద్వారా సర్వేలు చేయిస్తూ దీటైన అభ్యర్థుల గురించి ఆరా తీస్తున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుల మీద పోటీ చేయాల్సి ఉండడంతో రాజకీయ పార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యత కనిపిస్తుంది. మొత్తానికి గ్రామాల్లో స్థానిక ఎన్నికల సమరం రసవత్తరంగా మారింది.

చైర్మన్ పదవులపై గురి

స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా చైర్మన్ పదవులపై గురి పెడుతున్నారు. రిజర్వేషన్ కలిసి రావడంతో ఆ సామాజిక వర్గం నేతలు మాత్రం ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ప్రధానంగా జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులపై పలువురు నేతలు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. నోటిఫికేషన్‌విడుదల కావడం ఈనెల 9 నుంచి తొలి విడత నామినేషన్లు ప్రారంభం కానుండడంతో ప్రధాన పార్టీలు ముందుగానే అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసే అవకాశం కనిపిస్తుంది. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. జడ్పీ చైర్మన్ పదవిని మాత్రం జనరల్ మహిళకు కేటాయించారు. దీంతో ఈసారి జడ్పీ చైర్మన్ పదవికి గట్టి పోటీ ఉండనుంది. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీలు జడ్పీ పీఠం కోసం పట్టు పడుతున్నాయి. ఈసారి చైర్మన్ ఎన్నిక మరింత రసవత్తరంగా మారే అవకాశం కనిపిస్తుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లాలో జడ్పీ పీఠంతో పాటు అత్యధిక ఎంపీపీ స్థానాలు గెలుచుకోవడంపై దృష్టి సారించింది. అధికారంలోకి వచ్చాక తొలిసారి నిర్వహిస్తున్న స్థానిక ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి రెఫరెండంగా మారనున్నాయి. అందుకే అభ్యర్థుల ఎంపికలో ఆచితూచిగా వ్యవహరిస్తున్నాయి. గెలుపు గుర్రాలను బరిలో నిలిపేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. ఈనెల 5లోపు అభ్యర్థుల జాబితాలను పంపించాలని సీఎం ఆదేశించడంతో ఆ పార్టీ నేతలు అభ్యర్థుల ఎంపికలో బిజీబిజీగా మారిపోయారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు..

ప్రధాన పార్టీలన్ని స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నాయి. ఆదిలాబాద్ నియోజక వర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ప్రధాన పోటీ కనిపిస్తుంది. అక్కడక్కడ కారు పార్టీ కొంత బలంగానే ఉన్న మెజార్టీ స్థానాలలో గెలిచే అవకాశం లేదంటున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీ స్థానంతో పాటు ఎంపీ స్థానం దక్కించుకున్న బీజేపీ స్థానిక ఎన్నికల్లోను సత్తా చాటాలని భావిస్తోంది. ఇందుకు బలమైన అభ్యర్థులను రంగంలో దింపి జడ్పీ పీఠంతో పాటు ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతుంది. అలాగే బోథ్ నియోజక వర్గంలో టీఆర్ఎస్ కాంగ్రెస్ నువ్వా నేనా అన్నట్లు గా ముందుకు సాగుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో ఏ పార్టీకి ఎంత బలమన్నది ఫలితాల తర్వాతనే తేలిపోనుంది. మూడు ప్రధాన పార్టీలకు బలమైన క్యాడర్ ఉండడంతో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రజా, ఆర్థిక బలమైన అభ్యర్థులను పోటీలో దింపి విజయం సాధించేందుకు రాజకీయ పార్టీలు ఆరాట పడుతున్నాయి.

అభ్యర్థుల ఎంపికే ప్రధానం

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు

(తరువాయి 6వ పేజీలో....)

కాంగ్రెస్‌తోనే నెరవేరిన సొంతింటి కల

● మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

తలమడుగు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే సొంతింటి కల నిజమైందని మాజీ జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ మండలంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించ ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మండలంలో దాదాపు 600 ఇళ్లు మంజూరు చేసి నిర్మించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధితోనే టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతరం మండలంలోని రుయ్యాడి కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా నారాలక్ష్మి వెంకన్నను, పల్లి(బి) కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా కన్నపెల్లి విఠల్‌ను, కుచ్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా కుమ్మరి పార్వతి శంకర్‌లను మండల ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, రమేష్‌రెడ్డి, సోమన్న, లక్ష్మన్న యాదవ్, మాజీ సర్పంచ్‌లు పునాజి, మలుకు పటేల్‌తో పాటు అర్లి(కె), సకినాపూర్, ఉండం, కుచ్లాపూర్, లాల్‌గడ, లక్ష్మిపూర్, సోనాపూర్, పల్లి(కె), పల్లి(బి), లచ్చంపూర్ గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోక గణేష్‌రెడ్డి


ఉట్నూర్‌లో పాల్గొన్న ప్రజలు

ఉట్నూర్‌లో ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దివస్

● వివిధ సంఘాల ఆధ్వర్యంలో నివాళి

ఉట్నూర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో గురువారం దమ్మచక్ర పరివార్తన దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ఐబీచౌక్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వివిధ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్‌పీహెచ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌చౌహాన్, బ్రీజ్‌లాల్, ముంజం సోము, వీరయ్య, మేస్రం కేశవ్, దావుల రమేష్, రంజన బాయి, నాథరి రమేష్, భుజంగ్‌రావు, కపిల్, తదితరులు పాల్గొన్నారు.

● బౌద్ధ సమాజం ప్రజల ఆధ్వర్యంలో..

బజార్‌హత్నూర్: మండలంలో బౌద్ధ సమాజం ప్రజల ఆధ్వర్యంలో గురువారం దమ్మచక్ర పరివర్తన్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు దేగామ, పిప్పిరి, చందునాయక్ తండా, గోకొండ, మోర్ఖండి గ్రామాలలో ఊరేగింపు శోభాయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, పూలమాలలు వేసి తథాగత గౌతమ బుద్దుడికి పుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భూమన్న, గౌతమ్‌లు మాట్లాడుతూ యువతరం మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని వారిని అనుసరించాలని కోరారు. అనంతరం జెండాను ఆవిష్కరించి సామూహికంగా త్రిశరణం, పంచశీల్‌ను పఠించారు. ఆయా గ్రామాల్లో, కాలనీల్లో ప్రత్యేక కార్యక్రమాలుజరిగాయి. ఈ కార్యక్రమంలో సంఘం గ్రామ అధ్యక్షుడు ఏరేకార్ నిఖిల్, కానిందే మాధవ్, కానిందే వినోద్, భగత్ సోమన్న, భౌరేదామోదర్, భగత్‌లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జనహిత వేదిక పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇచ్చోడ పట్టణంలో గురువారం జనహిత వేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు కిన్నెర్ల మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యవర్గ ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా వీకే ప్రకాష్, సభ్యులుగా బొడ్డు భోజారెడ్డి, అంబయ్య, ఇస్తారి జీవన్‌రెడ్డి, బ్రహ్మానంద్‌రెడ్డి, నర్సయ్య, వెంకట్రావ్, తదితరులు ఎన్నికయ్యారు. జనహిత వేదిక ఆవిర్భావం పట్ల పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



జనహిత వేదిక నూతన కార్యవర్గ సభ్యులు

వైభవంగా దసరా ఉత్సవాలు

● దస్నాపూర్ మైదానంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుకలు ● వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శమి చెట్టుకు ప్రత్యేక పూజలు ● పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ● రావణ దహనంకు తరలి వచ్చిన జనం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పర్వదినాన్ని జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలందించిన భక్తులు.. దసరా పండగను వైభవంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ మైదానంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర దసరా మైదానానికి చేరుకోగా.. అక్కడ రావణ దహనం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు కార్యక్రమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులతో పాటు రాజకీయ నాయకులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమానికి హాజరైన అశేష జనవాహిని నడుమ అతిథులు ప్రసంగాలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శమి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున రావణ దహనం నిర్వహించారు. వేడుకలకు వేలాదిగా హాజరైన ప్రజలు ఈ దృశ్యాలను తమ సెల్ ఫోన్‌లలో బంధించారు. అంతకుముందు నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలో ఆకర్షణీయంగా వినాయక మండపాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు బహుమతులను ప్రదానం చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. విజయదశమి వేల ప్రజలంతా సన్మార్గంలో నడవాలని సూచించారు. మనలోని చెడును తొలగించి విజయ తీరాలకు చేరుకునే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. చెడుపై మంచి గెలిచిన రోజున పండగ వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు ఎల్లవేళలా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రావణ దహనం అంటే రావణున్ని దహనం చేయడం కాదని, రావణుని లోపల ఉన్న చెడును దహనం చేయడమన్నారు. ధర్మాన్ని మనం రక్షిస్తేనే ధర్మం మనల్ని రక్షిస్తుందని అన్నారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

● డైట్ మైదానంలో దసరా వేడుకలు..

ఆదిలాబాద్ టౌన్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండగను జరుపుకుంటామని మాజీ మంత్రి జోగు రామన్న, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన దసరా వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


దస్నాపూర్ మైదానంలో రావణ దహనం దృశ్యం


దసరా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

జమ్మి చెట్టుకు పూజలు చేసిన అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ.. వేడుకలకు సంబంధించి ఆటంకాలు ఎదురైనప్పటికీ.. ప్రజల సహకారంతో విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. విజయదశమి పర్వదిర గొప్పతనాన్ని వివరించారు. ఆ తర్వాత జోగు రామన్న మాట్లాడుతూ విజయదశమి రోజున చెడుపై మంచి గెలిచిందని అందుకే ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. అనంతరం రావణ దహనం చేశారు. నాగపూర్ ఆర్కెస్ట్రా బృంద కళాకారుల భక్తి పాటలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షులు నర్సాగౌడ్, కార్యదర్శి పడకంటి సూర్యకాంత్, గెడం మాధవ్, కోశాధికారి రేణుకుంట రవీందర్, కార్యనిర్వహక కార్యదర్శి కందుల రవీందర్ పాల్గొన్నారు.

● ఉట్నూర్‌లో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో గురువారం దసరా ఉత్సవాలు

(మరిన్ని వివరాలు 7వ పేజీలో....)


ఉట్నూర్‌లో శమీవృక్షానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్


నేరడిగొండలో వాహనానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వ్యక్తిపై కేసు

● రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిషేధం : ఆదిలాబాద్ డీఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గత నెల 19వ తేదీన న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అనుమతులు లేకుండా షెల్కే అజయ్ అలియాస్ మహాకల్ అజయ్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన కారణంగా అతనిపై, అతని అనుచరులపై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. గతనెల 19వ తేదీన అనుమతులు లేకుండా రోడ్డుపై అతని పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారని, పబ్లిక్ న్యూసెన్స్, రోడ్డును అడ్డుకోవడం, అనుమతులు లేకుండా టపాసులు కాల్చడం, అరుపులు శబ్దాలతో చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు కలిగించిన కారణంగా ఈ ఘటనపై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ప్రజా ప్రదేశాలలో అనుమతులు లేకుండా పుట్టినరోజు వేడుకలు చేయడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం లాంటివి చట్ట విరుద్ధమని తెలిపారు. ఒకరి పుట్టినరోజు వేడుకలు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని తమ ఇంటి వద్ద వేడుకలను నిర్వహించుకుంటే మంచిదని తెలియజేశారు. మహాకాళి గ్రూప్, టైగర్ గ్రూప్, ఈగల్ గ్రూప్, యువశక్తి గ్రూప్ అంటూ కొందరు తమ గ్రూపు అధ్యక్షుల పుట్టినరోజు వేడుకలను రోడ్లపై నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున వాటి ఉల్లంఘనలకు, రోడ్డుపై ఉన్న వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం, చట్ట ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. పబ్లిక్ స్థలాలలో పుట్టినరోజు వేడుకలలో టపాసులు కాల్చడానికి అనుమతులు లేవన్నారు. ముఖ్యంగా ఫైర్ క్రాకర్స్ కోల్డ్ ఫైర్ క్రాకర్స్ అంటూ టపాసులు కాల్చిన వారిపై, పేపర్‌లు చల్లడం, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీయిజంపై,గ్యాంగ్‌స్టర్లపై, భూమాఫియా దార్లపై, గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నామని, ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమాచారం ఉన్న జిల్లా పోలీస్ యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మావల సీఐ కర్ర స్వామి, ఎస్సైలు ఎల్ ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి